క్లుప్తంగా

24న పశువుల సంత వేలం

దేవరకద్ర: పశువుల సంత, గొర్రెలు, మేకల సంత, తైబజార్ కూరగాయల సంతకు సంబంధించి వేలం పాట ఈనెల 24న శుక్రవారం ఉదయం 10:30గంటలకు గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ఈఓ. సీత్యానాయక్, సర్పంచ్ విజయలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పశువుల సంత వేలంలో పాల్గొనే వారు రూ.3లక్షల డీడీని గ్రామ పంచాయతీ పేరు ఎస్‌బీఐలో చెల్లుబాటు అయ్యేలా తీసి 23వ తేదీ సాయంత్రం 5గంటలలోపు గ్రామ పంచాయతీలో ఇవ్వాలని కోరారు. అలాగే తైబజార్ కూరగాయల సంతకు రూ.1.50లక్షల డీడీ, గొర్రెలు, మేకల సంతకు రూ.2లక్షల డీడీ తీసి అందజేయాలన్నారు.

నేడు నాటక ప్రదర్శన

మిడ్జిల్: ఉగాది పండుగను పురస్కరించుకొని బుధవారం రాత్రి 9గంటలకు కొత్తపల్లిలో నవజ్యోతి కళానిలయం ఆధ్వర్యంలో సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



చెక్కులు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

• నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని పలు అభివృద్ధి పనులకు రూ.కోటి నిధులు మంజూరు చేసినట్లు నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని చంద్రాస్‌పల్లిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మండలంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లబ్ధిదారులకు మంజూరైన చెక్కులు, కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోయిలకొండలో నూతన గ్రంథాలయ నిర్మాణానికి రూ.60లక్షలు, ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి రూ.40లక్షల ప్రత్యేక నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ నిరూపరాణి, సర్పంచ్‌లు ఆంజనేయులు, గోపాల్, నాయకులు భీంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్యాంసుందర్, రాజవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

గుణాత్మక విద్య అందించాలి


కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): కేంద్రీయ విద్యాలయం ద్వారా విద్యార్థులకు గుణాత్మక విద్యతో పాటు నాణ్యమైన భోజనాన్ని అందించాలని కలెక్టర్ రవినాయక్ ఆదేశించారు. మంగళవారం ఎనుగొండలోని కేంద్రీయ విద్యాలయంలో మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. 2021–22 సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో విద్యార్థులు సాధించిన ఫలితాలు, పాఠశాలలో మౌలిక సదుపాయాలు, సిలబస్ ఇతర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. పదో తరగతి, ఇంటర్‌లో విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణులయ్యారని, పాఠశాలకు అప్రోచ్ రహదారి కావాలని ప్రిన్సిపాల్ దశరథ్‌రామ్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఏప్రిల్ మొదటి వారంలో మరోసారి పాఠశాలను సందర్శిస్తానని కలెక్టర్ తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలతో పాటు మెరుగైన విద్య అందించాలని కలెక్టర్ సిబ్బందిని ఆదేశించారు.

నేడు వరదరాజుల స్వామి రథోత్సవం

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని కోడూర్ వరదరాజులస్వామి ఆలయం ఉత్సవాలకు ముస్తాబైంది. ప్రతి ఏడాది ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామంలో వరదరాజులస్వామి ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా స్వామివారు వెలసిన ఆలయాన్ని అత్యంత సుందరంగా రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి రథోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తారు. గురువారం బిందెసేవ ఉంటుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం మాదిరిగానే హోలీ పండుగను నిర్వహిస్తారు. ఎక్కడా లేని విధంగా ఇక్కడ హోలీ మహోత్సవాన్ని హోలీ రోజు కాకుండా ఈ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నారు. ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బి.రాజేశ్వర్‌గౌడ్ పరిశీలించారు. స్వామివారి ఉత్సవాలను పురస్కరించుకుని అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తులు స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

కార్మికుడికి పరామర్శ

మిడ్జిల్: మండలంలోని బోయిన్‌పల్లికి చెందిన వాటర్‌మెన్ వెంకటయ్యపై ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేయడంతో మంగళవారం వివిధ కార్మిక సంఘాల నాయకులు పరామర్శించారు. దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని సంఘం మండల అధ్యక్షుడు యాదయ్య తెలిపారు. పరామర్శించిన వారిలో కురుమూర్తి, సత్తయ్య, మధు, చెన్నయ్య, యాదయ్య ఉన్నారు.

మతోన్మాద విధానాలను వ్యతిరేకిద్దాం



మహబూబ్‌నగర్ న్యూటౌన్: బీజేపీ అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ టౌన్‌హాల్ నుంచి బయలుదేరిన బైక్ ర్యాలీని జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్రకాంత్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రకాంత్ మాట్లాడుతూ బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. మతసామరస్యం, సామాజిక న్యాయం కోసం ఈనెల 17న నిజామాబాద్ జిల్లా నుంచి ప్రారంభమైన జన చైతన్యయాత్ర 26న మహబూబ్‌నగర్ జిల్లాకు వస్తుందన్నారు.

జయప్రదం చేయండి



మహబూబ్‌నగర్ రూరల్: సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 17నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్న జనచైతన్య యాత్రను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కడియాల మోహన్ కోరారు. మంగళవారం కోడూర్ చౌరస్తాలో యాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. 27న మండలంలోని కోడూర్ చౌరస్తా, రామచంద్రాపూర్, మణికొండ గ్రామాల మీదుగా కోయిలకొండకు యాత్ర చేరుకుంటుందని తెలిపారు.

ఉద్యోగాలు లేక నిరుద్యోగుల ఆత్మహత్యలు


సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

పాలమూరు: స్వరాష్ట్రం కోసం జరిగిన ఉద్యమం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల చావులపై సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చి నిరుద్యోగులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారం నిరసిస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో మంగళవారం న్యూటౌన్ నుంచి అంబేద్కర్‌చౌరస్తా వరకు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించి దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడిని బేషరతుగా విడుదల చేయాలన్నారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జడ్చర్ల టౌన్: స్థానిక బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.అప్పియాచిన్నమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంగ్లిష్, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్ పోస్టులకు గాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, అర్హత, ఆసక్తి కలిగిన వారు గురువారం సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 25న కళాశాలలో ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు.

బస్‌పాస్‌ల పంపిణీ

భూత్పూర్: ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి మంగళవారం ఉచిత బస్‌పాస్‌లను ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్ పంపిణీ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 500 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి రూ.25వేలతో ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి సొంత డబ్బులతో బస్‌పాస్ కార్డులను అందించారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ డిపో మేనేజర్ సుజాత, నాయకులు నారాయణ గౌడ్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు వెంకటయ్య, ఆర్టీసీ కంట్రోలర్ శ్రీనివాసరెడ్డి, లక్ష్మమ్మ, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కృషి

గండేడ్: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రెడ్డిపల్లిలో ఈజీఎస్ నిధుల నుంచి మంజూరైన సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యానాయక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, సర్పంచ్ నర్సింహారెడ్డి, ఎంపీటీసీ వెంకటేశం, రాంచంద్రరెడ్డి, గోపాల్, బాలరాజు పాల్గొన్నారు.

కోఆర్డినేటర్‌గా పాండురంగారావు

మిడ్జిల్: జాతీయ సమాచార హక్కు పరిరక్షణ సమితి జడ్చర్ల నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా మండలంలోని వాడ్యాల్‌కు చెందిన పాండురంగారావును నియమిస్తున్నట్లు రాష్ట్ర కో–ఆర్డినేటర్ ఉషారాణి నియామకపత్రం మంగళవారం అందజేశారు.

నటరాజ్‌కు పీఎంజేఎఫ్ అవార్డు



పాలమూరు: 30ఏళ్ల నుంచి సామాజిక సేవ చేస్తున్న రెడ్‌క్రాస్ చైర్మన్ లయన్ నటరాజ్‌కు హైదరాబాద్‌లో లయన్స్ క్లబ్ నుంచి పీఎంజేఎఫ్ అవార్డును మంగళవారం అందజేశారు. నటరాజ్ గతంలో పాలమూరు లయన్స్ క్లబ్ గవర్నర్‌గా కూడా పనిచేశారు.

అలరించిన ఉగాదినామ కవన దర్బార్



స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ సాహితీ, సీనియర్ సిటిజన్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఫోరం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన 'శోభకృత్ ఉగాది నామ కవన దర్బార్' అలరించింది. ఉమ్మడి జిల్లా నుంచి 40 మంది కవులు, కవయిత్రులు తమ కవితల్ని చదివి వినిపించారు. జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షుడు వి.మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ కవులు, కళాకారులకు పాలమూరు పుట్టినిల్లని, ప్రతి ఏడాది ఉగాది సందర్భంగా ఏర్పాటు చేస్తున్న కవి సమ్మేళనాన్ని కవన దర్బార్‌గా నిర్వహించడం సంతోషమని అన్నారు. కె.పద్మావతి ఆలపించిన పాటలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ సాహితీ జిల్లా ప్రచార కార్యదర్శి ఆర్.ప్రమోద్‌కుమార్, హౌజింగ్ ఏఈ, రచయిత వైద్యం భాస్కర్, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు, సాహితీ రాష్ట్ర అధ్యక్షుడు వల్లభాపురం జనార్దన, జిల్లా అధ్యక్షుడు ఖాజామైనద్దీన్, కార్యదర్శి నందిగామ కిశోర్, రాజసింహుడు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

బాలానగర్: మండలంలోని వివిధ గ్రామాల మైనార్టీ సోదరులకు ఎంపీడీఓ కృష్ణారావు, ఎస్‌బీఐ, ఏపీజీవీబీ మేనేజర్లు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందేందుకు 3యూనిట్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న 92మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అందుకుగాను 92మంది అభ్యర్థులకు గాను 62మంది అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారని ఎంపీడీఓ కృష్ణారావు తెలిపారు.

గండేడ్: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఉమ్మడి గండేడ్ మండలానికి మంజూరైన 8యూనిట్లకు వెన్నాచెడ్, గండేడ్, నంచర్ల, మహమ్మదాబాద్, దాదాపూర్, బ్యాంకుల మేనేజర్లు కార్పొరేషన్ రుణాల కోసం మొత్తం 218మంది మైనార్టీలు హాజరయ్యారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ మాధవి, ఎంపీఓ శంకర్ నాయక్ పాల్గొన్నారు.

కక్షసాధింపు సరికాదు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఈడీని అడ్డుపెట్టుకొని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్వార్థ రాజకీయాలు చేస్తూ ప్రతిపక్ష నాయకులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నదని బీఆర్ఎస్ నాయకుడు, సామాజిక వేత్త హనీఫ్ అహ్మద్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేశాన్ని దోచుకుంటున్న కార్పొరేట్ దొంగలను వదిలేసి అభివృద్ధికి పాటుపడుతున్న వారిపై కక్ష్య సాధిస్తుందన్నారు.

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోవాలి

జడ్చర్ల టౌన్: ప్రజలు తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలని వనపర్తి పోస్టల్ సూపరింటెండెంట్ దేవిరెడ్డి సిద్ధార్థ పిలుపునిచ్చారు. తపాలా శాఖ అందిస్తున్న సేవల గురించి ప్రజలకు తెలుపుతూ మంగళవారం మున్సిపాలిటీ పరిధిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 31వరకు పాలసీల మేళాను నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో బాదేపల్లి పోస్టాఫీస్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రవికుమార్, పోస్ట్‌మాస్టర్ కుమార్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి


అడ్డాకుల: అరకొర జీతాలతో ఇబ్బందులు పడుతున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కురుమూర్తి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే నెల 5న ఛలో ఢిల్లీ చేపట్టనున్నట్లు తెలిపారు. జంతర్ మంతర్ వద్ద లక్షలాది కార్మికులతో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పౌల్, నాగన్న, రాములు, బాలస్వామి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

మాదిగల సంగ్రామ పాదయాత్ర

జడ్చర్ల టౌన్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోరుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ పిలుపు మేరకు ఈ నెల 5న అలంపూర్‌లో చేపట్టిన మాదిగల సంగ్రామ పాదయాత్ర మంగళవారం మండలంలోకి ప్రవేశించింది. నవాబుపేట మండలం నుంచి ఉదండాపూర్ గ్రామంలోకి ప్రవేశించింది. అక్కడినుంచి వల్లూరు, బండమీదిపల్లి వరకు యాత్ర సాగింది. యాత్రలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి మాదిగ మాట్లాడుతూ యాత్ర వచ్చే నెల 3న శంషాబాద్‌లో ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ రాజుమాదిగ, కో కన్వీనర్ వినోద్‌మాదిగ, నారాయణపేట జిల్లా కన్వీనర్ నాగేష్, నాయకులు యాదయ్య, జంగయ్య, నాగేస్, చెన్నకేశవులు పాల్గొన్నారు.

నవాబుపేట: ఎస్సీ వర్గీకరణ సాధించడమే లక్ష్యంగా సంగ్రామ యాత్ర సాగుతుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి యదగిరి అన్నారు. సోమవారం మండలంలో సాగిన మాదిగల సంగ్రామ యాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు వినోద్, శాంతయ్య, రాజు, చెన్నకేశవులు, సురేష్, నగేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు



జడ్చర్ల టౌన్: అమావాస్యను పురస్కరించుకుని మంగళవారం పట్టణంలో వైభవంగా పూజలు నిర్వహించారు. విశ్వబ్రాహ్మణులు దుకాణాలు, ఇళ్లు శుద్ధి చేసుకుని పనిముట్లను శుభ్రం చేసి అలంకరించి పూజలు చేశారు. బాదేపల్లి పెద్దగుట్ట వద్ద ఉన్న వీరభద్రస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీగిరిక్షేత్రం అష్టలక్ష్మి ఆలయంలో చండీహోమం చేశారు. ఆచార్య కృష్ణస్వామి నేతృత్వంలో అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన జరిపించి హోమం, అనంతరం అన్నదానం నిర్వహించారు.

టైలరింగ్‌లో మహిళలకు శిక్షణ

బాలానగర్: భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, ఎస్‌బీఐ శిక్షణ సంస్థ ద్వారా 18–45 సంవత్సరాల మధ్య వయసు గల మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణా కార్యక్రమం చేపట్టినట్లు ఎంపీఓ నజీర్ అహ్మద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి పాలమూర్ జిల్లాకు చెందిన నిరుద్యోగ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. శిక్షణ సమయంలో అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతి కల్పించనున్నట్లు తెలిపారు. ఈనెల 27 నుంచి ఏప్రిల్ 26వరకు నెల రోజుల పాటు శిక్షణ ఉంటుందని వెల్లడించారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

అడ్డాకుల: మూసాపేట మండలం పోల్కంపల్లి వద్ద పెద్దవాగులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. జానంపేటకు చెందిన శివకుమార్, నగేష్ ట్రాక్టర్లతో పాటు పోల్కంపల్లికి చెందిన శ్రీనివాస్, సిరాజుద్దీన్ ట్రాక్టర్లలో మంగళవారం అనుమతి లేకుండా ఇసుకను నింపుకుని వెళ్తుండగా, పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం


ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్, డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని 25వ వార్డులో కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ ఫయాజ్ ఆధ్వర్యంలో మంగళవారం హాథ్‌సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గడప గడపకు తిరుగుతూ ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమం కోసం చేపట్టనున్న కార్యక్రమాల గురించి వివరించడానికి యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యాత్రకు ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500లకు గ్యాస్ సిలిండర్ అందజేస్తామని, ఏకకాలంలో రూ.2లక్షల రైతు రుణమాఫీ, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.5లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తామని వివరించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు సంజీవ్ ముదిరాజ్, వినోద్‌కుమార్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన
Sd/- K. CHANDRA MOULI
Panel Advocate & Legal Advisor
Mahabubnagar, Cell : 9440330760

బహిరంగ ప్రకటన
Sd/- K. CHANDRA MOULI
Panel Advocate & Legal Advisor
Mahabubnagar, Cell : 9440330760

బహిరంగ ప్రకటన
Sd/- K. CHANDRA MOULI
Panel Advocate & Legal Advisor
Mahabubnagar, Cell : 9440330760

బహిరంగ ప్రకటన
Sd/- K. CHANDRA MOULI
Panel Advocate & Legal Advisor
Mahabubnagar, Cell : 9440330760

బహిరంగ ప్రకటన
Sd/- K. CHANDRA MOULI
Panel Advocate & Legal Advisor
Mahabubnagar, Cell : 9440330760

బహిరంగ ప్రకటన
Sd/- K. CHANDRA MOULI
Panel Advocate & Legal Advisor
Mahabubnagar, Cell : 9440330760

బహిరంగ ప్రకటన
Sd/- K. CHANDRA MOULI
Panel Advocate & Legal Advisor
Mahabubnagar, Cell : 9440330760

బహిరంగ ప్రకటన
Sd/- K. CHANDRA MOULI
Panel Advocate & Legal Advisor
Mahabubnagar, Cell : 9440330760









